ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- నిత్యావసరాలతోపాటు బేకరీ ఐటమ్స్‌..
- అపరిశుభ్రంగా వంటగదులు
- పదార్థాలపై పురుగులు
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- ఫుడ్‌ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెలుగుచూసిన వాస్తవాలు

సంగారెడ్డి : నిత్యావసర వస్తువుల్లో అనవసర పదార్థాలను కలిపి కల్తీ చేస్తున్నారు. దీంతో కొన్నిసార్లు ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతుంది. మార్కెట్‌లో ఏ వస్తువుకు డిమాండ్‌ ఉంటుందో, ఆ వస్తువుకు ధర కూడా ఎక్కువే ఉంటుంది. కల్తీ వ్యాపారులు అలాంటి వస్తువులనే కల్తీ చేసి లాభాలు పొందుతారు. కల్తీకి కాదేది అనర్హం అన్నట్టుం ఈ రోజుల్లో నూనె, పాలు, నెయ్యి, పప్పు, కారం వంటి అన్ని నిత్యావసర వస్తువులు కల్తీకి కేరాఫ్‌ అడ్రస్‌గా మారాయి.

కాదేది..

పాలు, నూనె, నెయ్యి, పప్పు, మసాలా, కారం, పసుపు, ఇడ్లీ రవ్వ, అల్లంవెల్లుల్లి పేస్ట్‌ తదితర నిత్యావసరాలను కల్తీ చేస్తున్నారు. దీంతో ఇన్ఫెక్షన్‌లు, డయేరియా, విరేచనాలు, కడుపునొప్పి, ఏసీడీటీ, క్యాన్సర్‌ బాడే అవకాశం ఉంది. వాడిన నూనెలను మళ్లీ వాడడం, ఫుడ్‌ కలర్ల వినియోగిస్తే విరేచనాలు, వాంతులు అవుతాయి. అలాగే నిల్వ ఉంచిన ఆహారం తింటే కాలేయ సమస్యలు, హెపటైటీస్‌ వంటి తీవ్ర మైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌కు రెండు బాధ్యతలు

సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్లు, ఒక జిల్లా అధికారి విధులు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం ఒకరే రెండు బాధ్యతలు చూస్తున్నారు. మరోవైపు ఆహార నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌ టీమ్‌ లోనూ ఆయన సభ్యుడిగా ఉన్నారు. దీంతో ఒక్కరిపైనే పనిభారం పడడంతో పాటు అదనపు బాధ్యతలతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ఫిర్యాదు వస్తే తప్ప సాధారణ తనిఖీలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఏదిఏమైనా జిల్లాలో కల్తీ ఆహార నియంత్రణ, నాణ్యతా ప్రమాణాల మెరుగుకు అధికారులను నియమించాలని, కల్తీ కారకులపై కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ వస్తువు కల్తీ మయం


ఎస్‌ మార్ట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్‌ సేఫ్టీ అధికారులు (ఫైల్‌)

క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తాం

ఫుడ్‌ సేఫ్టీ నిబంధనలు ప్రతీఒక్కరూ పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తాం. ఆహార విక్రయదారులు పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. కల్తీ ఆహారం విక్రయిస్తే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తాం. ఇప్పటి వరకు 14 మంది నిర్వాహకులకు నోటీసులు ఇచ్చాం.

– అమృత, జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి, సంగారెడ్డి

ఘటనలు నిదర్శనం

- సంగారెడ్డిలో గతనెల 19న ఓ రెస్టారెంట్‌లో ఫుడ్‌ సేఫ్టీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పలు విషయాలు వెలుగుచూశాయి. కిచెన్‌ అపరిశుభ్రంగా ఉంది. వెజ్‌, నాన్‌వెజ్‌ పదార్థాలు ఒకే ఫ్రీజ్‌లో నిల్వ చేశారు. కూరగాయలు కుళ్లిపోయాయి. బేకరీలో ఆహార పదార్థాలు అపరిశుభ్రంగా ఉండటం గుర్తించారు. లేబుల్‌లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.
- పట్టణంలోని ఓ ప్రముఖ బేకరీలో నిర్వహించిన తనిఖీల్లో గడువు ముగిసిన పుట్టగొడుగులు, స్ట్రాబెర్రీలను గుర్తించారు.
- గత నెల 20న ఫసల్‌వాది శివారులోని ప్రైవేటు హాస్టళ్లు, మెస్‌ల్లో తనిఖీలు చేయగా పురుగులు ఉన్న మైదాపిండి, ఫంగస్‌ సోకిన ఉల్లిపాయలను గుర్తించారు. వంటగది అపరిశుభ్రంగా ఉంది. కూరగాయలు నిల్వ చేసిన ప్రాంతంలో పురుగులు కనిపించాయి. కాగా, ఫుడ్‌ సేఫ్టీ లైసెన్స్‌ లేని కారణంగా నోటీసులు జారీ చేశారు.
- గతనెల 27న రుద్రారంలోని ఓ ప్రముఖ జూనియర్‌ కళాశాల క్యాంటీన్‌ను ఆకస్మిక తనిఖీ చేయగా 50 కిలోల ఇడ్లీ రవ్వ గడువు ముగియడాన్ని గుర్తించారు.
- గతనెల 28న సుల్తాన్‌పూర్‌లోని ఓ విద్యాసంస్థ హాస్టల్‌లో తనిఖీ చేయగా స్టోర్‌ రూమ్‌లో ఎలుకలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వంటగది అపరిశుభ్రతతో పాటు దుర్వాసనకొడుతుంది. ముడిసరుకులు నాసిరకంగా ఉండడం గమనించి నోటీసులు జారీ చేశారు. పలు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. నివేదిక రాగానే చర్యలు తీసుకోనున్నారు.

చెక్కుల పంపిణీలో రసాభాస

- స్టేజీపైకి బీఆర్‌ఎస్‌ నేతలు రావడంపై అభ్యంతరం
- పోటాపోటీగా బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ నాయకుల నినాదాలు
- ఎమ్మెల్యే సునీతారెడ్డి నచ్చజెప్పే యత్నం
- గందరగోళం మధ్యనే లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి) : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కుల పంపిణీలో బీఆర్‌ఎస్‌ నాయకులు స్టేజీపై ఉండడంతో సమావేశం రసాభాసగా మారింది. గురువారం సాయంత్రం మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను 150 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి అధికారులతో కలిసి పంపిణీ చేస్తుండగా బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు స్టేజీపై ఉండడమే ఉద్రిక్తతకు కారణమైంది. బీఆర్‌ఎస్‌ నాయకులు స్టేజీ పైకి వెళ్లగా కాంగ్రెస్‌ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమంలో వారి పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంపై మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావుకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. దీంతో కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు.. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిగా ఎమ్మెల్యేకు, బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. నచ్చజెప్పి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. గందరగోళ పరిస్థితుల మధ్యే 197 మంది షాదీ ముబారక్‌ కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

అందరూ సహకరించాలి : ఎమ్మెల్యే సునీతారెడ్డి

పార్టీలకతీతంగా ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను అమలు చేస్తే అందరూ సహకరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ప్రోటోకాల్‌ను తాము ఎప్పుడూ విస్మరించలేదన్నారు. కొందరు నాయకులు కావాలనే గందరగోళం సృష్టించారన్నారు. జిల్లా పరిషత్‌ సీఈసీ స్వప్న, తహసీల్దార్‌ పర్వీన్‌, ఎంపీడీఓ శంకర్‌, తదితర అధికారులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్‌(నారాయణఖేడ్‌): విద్య వైద్యం, అన్నిరంగాల్లో అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందని నారాయణఖేడ్‌ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. గురువారం సిర్గాపూర్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్‌ గేమ్స్‌ ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు. అంతర్‌గాం నుంచి కామారెడ్డి జిల్లా బాన్సువాడకు ఆర్టీసీ బస్‌, కల్హేర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో అంబులెన్స్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ సీడీసీ చైర్మన్‌ నర్సింహారెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్‌ భాస్కర్‌సేట్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్‌: ఎల్‌ఆర్‌ఎస్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్‌ మున్సిపల్‌ కమిషనర్‌ జగ్జీవన్‌ కోరారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా దరఖాస్తుదారులు ఇళ్ల స్థలాలను సందర్శించి అవసరమైన వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. 74 లేఅవుట్లలో గల 3,848 ప్లాట్లకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం 2020లో దరఖాస్తులు చేసుకున్న వారికి క్రమబద్ధీకరించుకునేందుకు ఇది సువర్ణ అవకాశమన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు మున్సిపల్‌ కార్యాలయంలో సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వయం ఉపాధి హర్షణీయం


టీషాపును ప్రారంభించిన కాంగ్రెస్‌ నేత మధు

పటాన్‌చెరు: ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధి ఎంచుకొని వ్యాపార రంగంలోకి ప్రవేశించడం హర్షణీయం అని కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామానికి చెందిన ఎస్‌ఎంఆర్‌ యువసేన సభ్యులు సత్యనారాయణ ఏర్పాటు చేసిన టీ టైం షాప్‌ ను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వయం ఉపాధిని ఎంచుకోవడం ద్వారా తమ సొంత కాళ్ల పై తాము నిలబడటంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు.కార్యక్రమంలో భూపాల్‌ రెడ్డి, సంజీవరెడ్డి, నరేశ్‌ రెడ్డి, లక్ష్మణ్‌, యాదయ్య గౌడ్‌, నాగరాజు, ముత్యాలు, నాగభూషణం, లక్ష్మణ్‌, బాబు, విఘ్నేశ్‌కుమార్‌, శ్రీనివాస్‌ ఎస్‌ఎంఆర్‌ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి


కోహీర్‌లో రైతు కుటుంబాన్ని సెల్ఫీ తీసుకుంటున్న ఏడీఏ భిక్షపతి అధికారులు

జహీరాబాద్‌ టౌన్‌: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిసుందని, వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టే సర్వేకు రైతులు సహకరించాలని జహీరాబాద్‌ డివిజన్‌ వ్యవసాయ అధికారి భిక్షపతి అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గంలోని జహీరాబాద్‌, కోహీర్‌ తదితర మండలాల్లో రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లడం వల్ల కొంత మంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ప్రస్తుతం వివరాలు సేకరించి తరువాత వారందరికీ మాఫీ వర్తింస్తుందని చెప్పారు. మండలంలోని మల్‌చెల్మ, అనేగుంట గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి లావణ్య రుణమాఫీ కానీ రైతు కుటుంబాల వివరాలను సేకరించారు.

ఫార్మాసిటీ ఏర్పాటు వద్దు

జహీరాబాద్‌: న్యాల్‌కల్‌ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయవద్దంటూ జహీరాబాద్‌ఎంపీ సురేశ్‌ శెట్కార్‌కు మండలానికి చెందిన రైతులు వినతి పత్రం అందజేశారు. గురువారం జహీరాబాద్‌ వచ్చిన సందర్భంగా న్యాల్‌కల్‌ మండల రైతులు వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించారు. డప్పూర్‌, వడ్డి గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం భూసేకరణ చేపడుతోందని, ఫార్మా కంపెనీలు రావడం వల్ల కాలుష్యం బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. తాము భూములు ఇవ్వబోమన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎంపీ పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

- యువకుడిపై కుటుంబసభ్యుల అనుమానం


స్పందన

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన సిర్గాపూర్‌ మండలకేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ డి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎం. స్పందన వారం రోజుల క్రితం కంగ్టి మండలం ము ర్కుంజల్‌లో ఉన్న మేనత్త వద్దకు వెళ్తున్నానని చెప్పేసి వెళ్లింది. విచారిస్తే అక్కడికి చేరుకోలేదని తెలిసింది. దీంతో కుటుంబీకులు.. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా, గ్రామానికి చెందిన యువకుడు గోల్లపల్లి శంకర్‌పై అనుమానం వ్యక్తం చేశారు. యువతి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సమాచారం తెలిస్తే 87126–56759, 87126–56734 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీ శెట్కార్‌, ఎమ్మెల్యే మాణిక్‌రావు


జహీరాబాద్‌: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీ శెట్కార్‌, ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్‌: ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్‌ ఎంపీ సురేశ్‌ శెట్కార్‌, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావులు అన్నారు. గురువారం మండలంలోని పస్తాపూర్‌లో గల ఎస్‌వీ ఫంక్షన్‌ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఏ ప్రభుత్వం అయినా పేదల సంక్షేమం కోసమే పాటు పడతుందన్నారు. జహీరాబాద్‌ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందనుందన్నారు. ఇండస్ట్రియల్‌ స్మార్ట్‌ సిటీ రావడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో సెట్విన్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఎస్‌.గిరిధర్‌రెడ్డి, డీసీఎంఎస్‌ చైర్మన్‌ ఎం.శివకుమార్‌, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్‌, ఆర్డీఓ రాజు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం : ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్‌): పేదలకిచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు ప్రజాపాలన సజావుగా సాగిస్తున్న ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం కంగ్టిలోకి బసవ ప్రదీప్‌ ఫంక్షన్‌ హాల్‌లో 61 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కాంగ్రెస్‌కు చెందిన వారికి చెక్కుల ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని అన్నారు. ఇప్పుడు తాము అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. రుణ మాఫీతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోందన్నారు. మహాలక్ష్మి పథకం మహిళలకు వరమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. కంగ్టిలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు మంత్రి దామోదర రాజనర్సింహా సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ విష్ణుసాగర్‌, డీటీ జుబేర్‌ అహ్మద్‌, సీడీసీ చైర్మన్‌ శాదుల్‌, బసిరెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

జనసంచారంలోకి కొండచిలువ


దెగుల్వాడిలో కొండచిలువ

కంగ్టి(నారాయణఖేడ్‌): నివాస గృహాల మధ్యలోకి కొండచిలువ రావడంతో మండలంలోని దెగుల్వాడి గ్రామంలో బుధవారం రాత్రి కలకలం రేపింది. గోడపైకి ఎగబాకడం చూసి చుట్టుపక్కల వాళ్లు ఆందోళనతో పరుగులు తీశారు. ఆ తర్వాత కొండచిలువ ఎవరికీ కనిపించకుండా ఎటో వెళ్లిపోయింది. రాత్రి సమయంలో టార్చిలైట్లు వేసి పరిసరాల్లో స్థానికులు గాలించారు. కాగా, అటవీ అధికారులు కొండచిలువను పట్టుకోవాలని కోరుతున్నారు.

వైద్యశిబిరం సందర్శన


చెక్కులను అందజేస్తున్న నిర్మల

కొండాపూర్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్‌లో నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని గురువారం టీజీఐఐసీ చైర్‌పర్సన్‌ నిర్మల సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కంటి సమస్యలను గుర్తిస్తే ప్రభుత్వం ఉచితంగా అద్దాలను అందిస్తోందన్నారు. అందులో భాగంగానే వైద్యశిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గొల్లపల్లిలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను అందజేసి, ఆ తర్వాత గౌడ సంఘం భవనం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్‌ ప్రభు, పీఏసీఎస్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మనోజ్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో మానసికోల్లాసంతోపాటు దేహదారుఢ్యం పొందొచ్చని వక్తలు అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాల, ఉన్నత పాఠశాల, జెడ్పీ పాఠశాలల్లోని విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రదానోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రజాప్రతినిధులు, ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, సామాజిక సేవా సంఘాల నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


జహీరాబాద్‌ టౌన్‌లో..


నారాయణఖేడ్‌లో...


సంగారెడ్డి: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు


సంగారెడ్డిరూరల్‌లో..


రామచంద్రాపురంలో..


రాయికోడ్‌లో...


సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: తారా ప్రభుత్వ కాలేజీలో...

సంక్షిప్త వార్తలు

సులువైన పరిష్కారం

పటాన్‌చెరు టౌన్‌: నూతనంగా ప్రారంభించిన యంత్రంతో డ్రైనేజీ సమస్యల పరిష్కారం సులువు అవుతుందని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌ అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్‌లో డ్రైనేజీ క్లీనింగ్‌ కోసం జీహెచ్‌ఎంసీ ప్రవేశపెట్టిన నూతన సెల్ఫాన్‌ ఆఫ్‌ బకెట్‌ క్లీనర్‌ నూతన యంత్రాన్ని ప్రారంభించారు. డ్రైనేజీ నాలా సమస్యలు పరిష్కరించేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శాంతినగర్‌ కాలనీలో మిషన్‌ ద్వారా డ్రైనేజ్‌ పనులను చేయించి, మిషన్‌ పని తీరును పరిశీలించారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

మునిపల్లి(అందోల్‌): రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకులు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రైతులు తహసీల్దార్‌ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్‌, నగేశ్‌గౌడ్‌, అశోక్‌గౌడ్‌, సుభాశ్‌, లక్ష్మణ్‌, యాదయ్య, శ్రీనివాస్‌, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పటాన్‌చెరు టౌన్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చింది కానీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక షరతులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. మాఫీ చేసి తిరిగి రుణాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

వివరాల సేకరణ

ఝరాసంగం(జహీరాబాద్‌): రుణమాఫీ అమలు కాని రైతుల కుటుంబ నిర్ధారణ వివరాలు సేకరిస్తున్నట్లు ఏఓ వెంకటేశ్వర్‌ వెల్లడించారు. గురువారం మండల ంలోని జీర్లపల్లిలో వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో రుణమాఫీ అమలు కోసం 531 మంది రైతుల కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భారతి, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

హత్నూర(సంగారెడ్డి): భారతీయ జనతా పార్టీ బూత్‌ స్థాయిలో బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మురళీధర్‌ యాదవ్‌ అన్నారు. గురువారం మండలంలో పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పేకాట స్థావరంపై దాడులు

సదాశివపేట రూరల్‌ (సంగారెడ్డి): మండలంలోని ఆరూర్‌.. నీలకంఠ టెంట్‌ హౌస్‌ వద్ద నడుపుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరుల వద్ద నుంచి రూ 8,540లు, 6 సెల్‌ఫోన్లు, ప్లే కార్డ్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్‌ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!

పటాన్‌చెరు టౌన్‌: విద్యుత్‌ షాక్‌ తగిలి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్తీక్‌ దాస్‌ (36) బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌ మండలం సుల్తాన్‌పూర్‌ గ్రామ సమీపంలోని శక్తి ఇంజనీరింగ్‌ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం క్రేన్‌ వద్ద పని చేస్తున్న సమయంలో అతను, చోటేలాల్‌ క్రేన్‌ పట్టుకొని నడుస్తున్నారు. క్రేన్‌ డ్రైవర్‌ నిర్లక్ష్యంగా నడిపి విద్యుత్‌ వైర్లకు తగిలించడంతో ఇద్దరికీ విద్యుత్‌ షాక్‌ తగిలి, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం బొల్లారంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా కార్తీక్‌ దాస్‌ మృతిచెందాడు. చోటేలాల్‌ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనం సజావుగా జరిగేలా చూడండి

నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి


చెరువును పరిశీలిస్తున్ననగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) /పటాన్‌చెరు టౌన్‌ : గణనాథుల నిమజ్జనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఆమె పట్టణంలోని రాయసముద్రం చెరువును సందర్శించారు. వినాయకులను నిమజ్జనం చేసే కోనేరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గణపతి నవరాత్రులను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో సాకి చెరువును నగర మేయర్‌ సందర్శించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌, డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌ కు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పుష్పనగేష్‌, ఉప కమిషనర్‌ సురేష్‌, సీఐ జగన్నాథ్‌, ఎస్‌ఐ శశికాంత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.